TGTEL/26/A4985


# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

ఎడిటర్ శివ కుమార్ బిఎస్ | సంపుటి : 1 సంచిక : 03 | శుక్రవారం, జూలై 17, 2026, | పేజీలు - 4 | వెల: 5/-

### గోదావరి నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో

## వినియోగంలోకి తెస్తాం



హైదరాబాద్ : సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గోదావరి జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి భట్టి విక్రమార్క క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

గోదావరి జలాల వినియోగానికి సమగ్ర కార్యాచరణ : గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క వివరించారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించే విధంగా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పటికే రూ.7,500--8,000 కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు. ప్రస్తుతం భారీ ప్రజాధనం ఇప్పటికే వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను సమన్వయం చేసి గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తున్నప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లుగా ఉత్తమ్ వివరించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

### వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర

## కార్యాచరణ సిద్ధం చేస్తాం



హైదరాబాద్, జులై 16 : వర్షాభావాన్ని ఎదుర్కొనే ందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఎల్‌నినోపై రాష్ట్ర తొలి శాస్త్రీయ కంటింజెన్సీ ప్లాన్ విడుదల చేస్తామని తెలిపారు. ఈరోజు సచివాలయంలో ఈ ప్రణాళికను విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఆయా మండలాలు, జిల్లాల వారీగా వర్షపాతం లోటు వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు. ందు నెలల వాతావరణ అంచనాల ఆధా రంగా కార్యాచరణ రూపొంది స్తామని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. ఐఎండీ సమాచారంతో రోజువారీ వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. రైతులకు పంటల ఎంపిక, నీటి వినియోగంపై శాస్త్రీయ సూచనలు అందజేస్తామని చెప్పారు. ఆయా పంట నష్టాల నివారణకు అన్ని శాఖల సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

### నెల రోజుల్లో భోగాపురం అంతర్జాతీయ

## విమానాశ్రయం ప్రారంభం



ఢిల్లీ, జులై 16 : విమాన ప్రయాణికులను దోపిడీ చేసే స్థాయిలో ధరలు పెరిగితే కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని చర్యలు తీసుకుంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ప్రయాణికులపై భారం పడనివ్వబోమని పేర్కొన్నారు. (గురువారం) ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ ఆధ్వర్య ంలో ఉడాన్ 2.0 వర్క్‌షాప్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉడాన్ 2.0తో మరో పదేళ్ల పాటు ప్రాంతీయ విమానయానానికి ప్రయోజనం కలుగుతోందని రామ్మోహన్ తెలిపారు. ప్రాంతీయ విమాన యాన అనుసంధానాన్ని మరింత విస్తరించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఉడాన్ పథకాన్ని మరో పదేళ్ల పాటు పొడిగించిందని వెల్లడించారు. జులై 4వ తేదీన జోధ్‌పూర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉడాన్ పథకాన్ని ప్రారంభించారని ప్రస్తావిం చారు. 1.66 కోట్ల మంది ప్రయాణికులు ఉడాన్ పథకం ద్వారా ప్రయోజనం పొందారని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో ఉడాన్ పథకాన్ని అమలు చేయడానికి కేంద్రం రూ. 29 వేల కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు. రాబోయే పదేళ్లలో 100 కొత్త విమానాశ్రయాలు, 200 కొత్త హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని రామ్మోహన్ పేర్కొన్నారు.

## హైడ్రోజన్ రైళ్లలో ప్రపంచానికి భారత్ ఆదర్శం

**– జింద్ సోనిపట్ ప్రాజెక్టుతో గ్రీన్ రైల్వే దిశగా కీలక అడుగు**

ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ: హైడ్రోజన్ ఆధారిత రైళ్ల అభివృద్ధిలో భారత్ కీలక ముందడుగు వేసింది. జింద్--సోనిపట్ హైడ్రోజన్ రైలు ప్రాజెక్టుతో దేశంలోనే అతిపెద్ద హైడ్రోజన్ రీఫ్యూయలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రోలింగ్ స్టాక్, హైడ్రోజన్ నిల్వ, పంపిణీ, భద్రతా వ్యవస్థలు, నిర్వహణ విధానాలతో కూడిన సమగ్ర హైడ్రోజన్ రైల్వే ఎకోసిస్టమ్‌ను భారతీయ రైల్వే అభివృద్ధి చేసింది.రైలులో అత్యాధునిక భద్రతా ప్రమాణాలను అమలు చేశారు. హైడ్రోజన్ లీకేజీ గుర్తింపు వ్యవస్థ, ఆటోమేటిక్ షట్‌డౌన్, మంటలను నియంత్రించే సాంకేతికత, లోకో పైలట్ భద్రత కోసం ప్రత్యేక క్యాబిన్, అత్యవసర పరిస్థితుల్లో రైలును సురక్షిత ప్రాంతానికి తరలించే వ్యవస్థలను ఏర్పాటు చేశారు. జింద్‌లోని హైడ్రోజన్ ప్లాంట్‌లో కూడా లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్టర్లు, ఆటోమేటిక్ షట్‌డౌన్, ఫైర్ అలారాలు, వాటర్ స్ప్రే వ్యవస్థలు అమర్చారు. ఈ ప్రాజెక్టు అంతర్జాతీయ ఎన్ఎఫ్ పిఏ–2, 19880 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించబడింది. అలాగే పేఈఎస్ఓ నిబంధనలను పాటిస్తూ,



జర్మనీకి చెందిన ప్రముఖ సాంకేతిక తనిఖీ సంస్థ టీయూవీ ఎస్ఓడి స్వతంత్ర భద్రతా పరీక్షలు నిర్వహించి ఆమోదం తెలిపింది.ప్రయాణికుల సేవల్లోకి తీసుకురావడానికి ముందు లోడ్ బాక్స్ పరీక్షలు, రేడియో ఫ్రీక్వెన్సీ పరీక్షలు, ఆపరేషన్ స్థిరత్వ పరీక్షలు, అత్యవసర బ్రేకింగ్ పరీక్షలు వంటి పలు కఠిన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు.ప్రస్తుతం జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి కొద్ది దేశాలు మాత్రమే హైడ్రోజన్ రైళ్లను ప్రయోగాత్మకంగా లేదా పరిమిత స్థాయిలో




నడుపుతున్నాయి. అయితే భారత హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలు పరిమాణం, సామర్థ్యం, మౌలిక వసతుల పరంగా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. భవిష్యత్తులో కల్కా– షిమ్లా వంటి వారసత్వ రైల్వే మార్గాల్లో కూడా హైడ్రోజన్ సాంకేతికతను వినియోగించేందుకు భారతీయ రైల్వే ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ కార్యక్రమం జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్, నెట్ జీరో లక్ష్యాల సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

## తొలి బోనంతో ఆషాఢ బోనాల ఉత్సవాలకు శ్రీకారం





### – గోల్కొండలో ఘనంగా అమ్మవారికి పూజలు

ఆదాబ్ సైబరాబాద్, గోల్కొండ :హైదరాబాద్‌లోని గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఆషాఢ బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. లంగర్‌హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య తొలి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాఢ బోనాల ఉత్సవాల బుక్‌లెట్‌ను మంత్రులు ఆవిష్కరించగా, జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ.11 లక్షల ఆర్థిక సహాయ చెక్కును అందజేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. జగదాంబిక అమ్మవారి కటాక్షంతో ఎల్‌నినో ప్రభావం తగ్గి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందని, బోనాల ఉత్సవాల సందర్భంగా పెద్ద, చిన్న దేవాలయాలకు నిధులు కేటాయించడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు కరెంట్ ఇవ్వకపోగా భూములపై

## ట్యాక్స్ వేస్తారట




హైదరాబాద్:రిటైర్డ్ ఇంజినీర్లు, తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మేడిగడ్డ గేట్లు మూయ కుండా కన్నెపల్లి గేట్లు ఎత్తొచ్చని చెప్తే.. ఆ నీళ్లు ఎత్తొచ్చని చెప్పిన ఇంజినీర్లను జైళ్లలో పెడతమని, బెల్ట్‌తో కొడ్తమని రాజకీయాలు చేస్తున్నది మీరని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ. రైతులకు నీరందంచండి. కరెంట్ ఇవ్వండి. విద్యుత్ సామర్థ్యం ఉన్నది.. విద్యుత్ ప్లాంట్లు ఉన్నయి. బొగ్గు లేక విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. దృష్టి పెట్టండి అని ప్రభుత్వాన్ని ముల్లు కట్టె పెట్టి నిద్రలేపుతున్నాం. మీకు విష యాలు చెబుతున్నమన్నారు. రాజకీయాలు చేయ డం మీరు మానండి.. విద్యుత్ ఉత్పత్తి పెంచ ండి. రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వండని ప్రభుత్వానికి హరీశ్ రావు సూచించారు.. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ చేస్తారట. కమీషన్ల కోసం గ్రీన్ ఎనర్జీ పాలసీని నిలిపేశారు. నాణ్యమైన బొగ్గును వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. దేవాదులకు నీళ్లు అందడానికి కారణం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోతలు–వాతలు తప్ప ఏమీ లేవన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరిన పలువురు నాయకులు



■ తీన్మార్ మల్లన్న సమక్షంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానం

**ఆదాబ్ తెలంగాణ, మేడ్చల్--మల్కాజిగిరి:** తెలంగాణ రాజ్యాధికార పార్టీకి ప్రజా మద్దతు రోజురోజుకూ పెరుగుతోందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బంగ్ల గూడ ఆర్జీ కాలనీకి చెందిన పలువురు నాయకులు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న పార్టీ కండువా కప్పి కొత్త సభ్యులను పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీ రాజ్యాధికార సాధనే పార్టీ ప్రధాన లక్ష్యమని, ప్రజల కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎన్. బాలకృష్ణ, పోతారం శివకుమార్, పోతారం నవీన్ కుమార్, డి. శివ, సీహెచ్. శివాజీ, దర్శనపు ప్రభాకర్ తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.
కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, మురళితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేతలకు ఎమ్మెల్యే కృష్ణారావు దిశానిర్దేశం

■ ఎస్ఐఆర్ కార్యక్రమంపై పార్టీ సమీక్ష
ప్రతి ఓటరుకు సహకరించి ఓటు
■ హక్కును పరిరక్షించాలని పిలుపు



**ఆదాబ్ సైబరాబాద్, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం బోయినపల్లి, బేగంపేట్, ఫతేనగర్ డివిజన్‌ల మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, బీఎల్‌ఏలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడం పార్టీ నాయకుల బాధ్యత అని తెలిపారు. బీఎల్‌ఏలు, బీఎల్‌వోలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అధికారులు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లకు అవసరమైన వివరాలు తెలియజేసి, దరఖాస్తుల నింపడంలో సహకరించాలని కోరారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సేకరించి సంబంధిత అధికారులకు అందజేసి వారి ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని చెప్పారు. ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, ప్రతి ఓటును కాపాడేందుకు పార్టీ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు.

# బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం




■ మూల విక్రమ్ గౌడ్‌కు ఆహ్వానం

**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** బల్కంపేట్ వాస్తవ్యులు, బి.కె. గూడా డివిజన్ అధ్యక్షుడు రవికాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీధర్ గౌడ్, నిఖిల్ గౌడ్, హరి గౌడ్, అశోక్ గౌడ్, సురేష్ గౌడ్ తదితరులు కలిసి మూల విక్రమ్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బల్కంపేట శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న బీజేపీ నేత భరత్ సింహారెడ్డి






**ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ :** నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్ పరిధిలో వివేకా నంద నగర్, సాయి నగర్, ప్రసూన నగర్, మాణిక్య నగర్, సుదర్శన్ రెడ్డి నగర్, కాకతీయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి రథాన్ని లాగి రథయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తి, సమానత్వానికి ప్రతీక అయిన జగన్నాథ రథయాత్ర అందరికీ శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని, ప్రతి కుటుంబంపై శ్రీ జగన్నాథ స్వామివారి దివ్య అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి శ్రీధర్ బాబు


– మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్:** రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీని అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ప్రతినిధులు, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మచారి, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హైదర్‌నగర్‌లో ఘనంగా జగన్నాథ రథయాత్ర ప్రారంభం..

– మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభోత్సవం






**ఆదాబ్ సైబరాబాద్, కూకట్‌పల్లి :** ఇస్కాన్ టెంపుల్ ప్రభుజీ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ మైసమ్మ ఆలయం నుంచి గురువారం జగన్నాథ రథయాత్రను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి జగన్నాథ స్వామివారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భజనలు, కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్, వివేకానంద నగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉప్పల విద్య కల్పన గౌడ్ అలాగే ఇస్కాన్ ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళలు ఆషాడంలో ఆనందంగా జరుపుకునే గోరింటాకు పండుగ అందం...ఆరోగ్యం...అతివలకు

■ సంప్రదాయానికి ప్రతీక గోరింటాకు..
■ ఔషధ గుణాలతో ఆరోగ్య రక్షణ
■ ఆషాడ మాసంలో గోరింటాకు పండుగ.. మహిళలలో ఉత్సాహం





**ఆదాబ్ సైబరాబాద్, శంకర్‌పల్లి :** గోరింటా పూసింది కొమ్మ లేకుండా మురిపాల అరచేత మొగ్గ తొడిగింది అన్నాడు ఓ సినికవి. కృత్రిమ ఎరుపు కంటే ఆరోగ్యం ఇచ్చే గోరింట మిన్న ఆషాడం వచ్చింది అంటే చాలు గోరింటాకు ప్రతి ఒక్క మహిళలకు గుర్తొస్తుంది. ఆషాడ మాసం ముగిసే లోపు ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకోవాలని పూర్వీకులు చెబుతారు. అందుకే ఆషాడం అంటే గోరింటాకు పండుగ అంటారు. గోరింటాకు చేతులకు పెట్టుకొని యువతులు ఎంతో మురిచిపోతూ ఉంటారు. శుభకార్యాలు పండుగలు ఆషాడ మాసంలోనే, ఔషధణాలు గోరింటాకులో ఎక్కువగా ఉంటాయి. ఇటీవల కాలంలో మహిళలందరూ ఒకేచోట చేరి మెహందీ పడుగ గాను చేసుకోవడం. కిట్టి పార్టీలో కూడా ఆషాడ మొహిందీ పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు ఒకచోట గోరింటాకు పెట్టుకునేటప్పుడు మహిళలు ఎంతో సందడిగా ఉత్సాహంతో ఉంటారు. చర్మవ్యాధులు రాకుండా వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మవ్యాధులు రాకుండా రక్షించుకోవచ్చు అనేది ఎప్పటి నుంచో వస్తున్న మన సంప్రదాయం ఆరోగ్య రహస్యం, ఆషాడ మాసంలో వర్షాలు ఎక్కువగా కురవడంతో పొలాలు బురదగా మరి క్రిమికీటకాలు వస్తుంటవి. మహిళల పొలాల్లో వరి నాట్లు వేయడం వలన చేతులు కాళ్ళకు బురద అం టుకు ంటుంది. ఈ ఆషాడ మాసంలో మైదాకు పెట్టుకుంటే చర్మ వ్యా ధులు రాకుండా కాపాడుతాయని వైద్యులు పలువురు చెబుతున్నారు.

● **ఆషాడ మాసం యొక్క ప్రత్యేకత**

ఆషాడ మాసంలో ఏదో ఒక రోజు గోరింటాకు పెట్టుకోవాల నేది మన పూర్వీకులు చెప్పిన సంప్రదాయం. ఆనాటి నుండి సాంప్రదాయాలు అదేవిధంగా నేటి వరకు కొనసాగుతున్నాయి. గోళ్ళకు రంగును ఇచ్చే గోరింటాకు నఖరంజని అనే పేరు కూడా ఉంది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేటి ఆధునిక కాలంలో గోరింటాకు పేరుతో రకరకాల కోన్లు పేస్టులు మహిళలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఆ కోన్లు పేస్టులు రంగును అందాన్ని ఇస్తాయి తప్ప వాటిలో ఎలాంటి ఔషధ గుణాలు ఉండవు.

● **గోరింటాకు ప్రయోజనాలు**

మైదాకు వేళ్లకు పెట్టుకోవడం, గోళ్ళు పెలుసు బారిపోకుండా కాపాడుతుంది. ఆకులే కాకుండా పూలు, వేర్లు, బెరడు విత్తనాలు కూడా ఔషధ యుక్తాలే. వీటితో శరీరంలోని ఎలర్జీను దూరం చేసుకోవచ్చు. బోధకాలు వ్యాధి ఎలాంటి దరిచేరదు. నెలకు ఒకసారి గోరింటాకు ముద్దను తలకు ప్యాక్ చేసుకుంటే జుట్టు బలపడి రాలదుంటాకు ఉంటుంది. గోరింటాకు పొడి కాచిన నూనె వాడడం చిట్కా వైద్యంలో ఒకటి. గోరింటాకు ముఖ్యంగా ఒంట్లో వేడిని తగ్గిస్తుంది.

● **గోరింటాకు తయారు చేసే విధానం**

మైదాకులో చింతపండు వేసి మధ్యలో కొద్దిగా మజ్జిగా వేసి రోట్లో రుబ్బాలి. మిక్సీలోన నాణ్యమైన గోరింటాకు ఇత్తలూ ఆకులు పొడిని వేడి నీళ్ళలో కలిపి రాత్రంతా నానబెడితే మంచి రంగులోకి మారుతుంది. మెహందీకు కాపా పొడిని కలిపి రాత్రంతా నానబెట్టాలి. తర్వాత రోజు పెట్టుకోవాలి దీంతో కాపీ బ్రౌన్ కలర్లో పండుతుంది. నెంబర్ వసంతంలో పంచదార తయారు చేసుకోవాలి. పెన్నాకు కాపీ పొడిని కలిపి రాత్రంతా నానబెట్టాలి తర్వాత రోజు పెట్టుకోవాలి

● **సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక: డాక్టర్ సాయి సింధు**

ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది సంస్కృతి సాంప్రదాయంగా వచ్చే ఆనవాయితీ, వర్షాకాలం వస్తే ఆరోగ్య బారిన పడకుండా గోరింటాకు శరీరానికి వెచ్చద నాన్ని ఇస్తుంది. ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడుతుందని సాన్స్ స్కిన్ హాస్పిటల్ డాక్టర్ సాయి సింధు తెలిపారు.

● **చిన్ననాటి నుండి వస్తున్న ఆచారం: రాజశ్రీ**

ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది చిన్ననాటి నుండి ఒక ఆనవాయితీ చిన్నతనం నుండి గోరింటాకు పెట్టుకుంటున్నాను. గోరింటాకును పోసి రోట్లో వేచి దంచి పాడపాడుతూ ఒకే చోటకు చేరి గోరింటాకును పెట్టుకునే వాళ్ళం అని ఆర్ఆర్ ప్రొఫెషనల్ మేకప్ స్టూడియో యజమానురాలు రాజశ్రీ తెలిపారు.

● **గాజులు ఇచ్చి పుచ్చుకుంటాం: రాజేశ్వరి**

ఆషాడం వచ్చింది అంటే గాజులు ఇచ్చిపుచ్చు కుంటాం. ఆషాడం వచ్చిందంటే ముందుగా గుర్తిచ్చేది గోరింటాకు. అందరం ఒకే చోట చేరి గోరింటాకు పెట్టుకోవడంతో గాజులు ఇచ్చిపు చుకుంటాం. అమ్మవారికి పూజలు నిర్వహించి గోరింటాకు పెటుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుందని గృహిణి రాజేశ్వరి తెలిపారు.

● **అనాదిగా వస్తున్న ఆచారం: ప్రిన్సిపాల్ శోభారాణి**

గోరింటాకులో "మంచి ఔషధ గుణాలు ఉన్నాయి. గోరింటాకు పెట్టుకోవడం అనేది అనాదిగా వస్తున్న ఆచారం. సాంప్రదాయమే కాకుండా వాతావరణంలో వచ్చే మార్పుల వలన శరీరంలో వచ్చే మార్పులను తొలగించే మంచి ఔషధం గోరింటాకు ఉంది. అందుకే ఆషాడంలో తప్పకుండా గోరింటాకు పెట్టుకు ంటాం అని టీఎస్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు.

● **సంప్రదాయం... ఔషధం : డాక్టర్ చైతన్య**

మైదాకు చేతులకు పెట్టుకోవడం సంప్రదాయంతో పాటు మంచి ఔషధం. ఇది పూర్వం నుంచి వస్తున్న ఆచారం. నేడు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కోన్లు వచ్చాయి. కోన్లను వాడాల్సి వస్తుంది. మంచి కంపెనీలకు చెందిన గోరింటాకు కోన్లలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. శుభకార్యాలకు మహిళలు తప్పక మైదాకు పెట్టుకుంటున్నారని మెగా హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య అన్నారు.

# కామారం గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం: మంత్రి సీతక్క



**ఆదాబ్ సైబరాబాద్, ములుగు :** జిల్లా తాడ్వాయి మండలంలోని కామారం గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలపై గ్రామ ప్రజలు తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి అత్యవసరంగా కళ్యాణ మండపం, హరిత హోటల్ నిర్మాణంతో పాటు గ్రామ కంఠం భూముల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క గ్రామ ప్రజల సమస్యలను ఓర్పుగా విని, సంబంధిత అధికారులతో చర్చించి న్యాయమైన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, కామారం గ్రామ సర్పంచ్ కోర్నిబెల్లి సావిత్రి, ఉపసర్పంచ్ రేగ అనిల్, గ్రామ పెద్దలు పాయం కోటేశ్వరరావు, రేగ ఆనంద్, మాజీ సర్పంచ్ కోర్నిబెల్లి లక్ష్మీ నర్సయ్య, గ్రామ మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సాగులో ఉన్న భూములలో కందకాలు తీయడం ఆపాలి

- ఆదివాసులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలి
- తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ములుగు
- జిల్లా కార్యదర్శి అధ్యక్షులు గొంది రాజేష్ దుగ్గి చిరంజీవి



**ఆదాబ్ సైబరాబాద్, ములుగు :** ములుగు జిల్లా పసర రేంజి ఆఫీస్ ముందు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోడు భూములలో కంధకాలు తీయడం ఆపాలని ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ములుగు జిల్లా కార్యదర్శి అధ్యక్షులు గొంది రాజేష్ దుగ్గి చిరంజీవి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పోడు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్న ఆదివాసి భూములపై గత కొద్ది రోజుల నుండి ఫారెస్ట్ అధికారులు కందకాలు తీయడం దుర్మార్గమైన చర్య అని గత ప్రభుత్వ కాలంలో అటవీ హక్కుల పత్రాలు ఇస్తామని సర్వే చేయగా ఎస్టీ సర్టిఫికెట్లు లేని కారణంగా హక్కుపత్రాలు ఇవ్వడం ఆపివేశారు ఎలక్షన్ల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టాలు లేని పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కూడా వాటిని ఊసే లేకుండా నిమ్మకు నీరు ఎత్తనట్టుగా ఉన్నదే కాకుండా ఇప్పుడు ఫారెస్ట్ అధికారుల దాడులు గుంతలు తీయడానికి ప్రభుత్వం ముమ్మరం చేస్తున్నాయి ఇప్పటివరకు ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా కూడా కొత్తది కొట్టం పాతది వదిలిపెట్టడం అనే నినాదంతో ఉన్నప్పటికీ కూడా సాగులో ఉన్న భూములలో కందకాలు తీయడం తీవ్రతరం చేస్తున్నారు ఇప్పుడు పంట వేసుకునే కాలం వచ్చినప్పటికీ విత్తనాలు చల్లుకునే సమయానికి భూములలో వ్యవసాయం చేయకుండా కందకాలు తీస్తూ ఆరైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వం మంత్రి సీతక్క స్పందించి వెంటనే సాగులో ఉన్న భూములలో కందకాలు తీయడం నిలిపివేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాము లేకపోతే సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోరాటాలను ఉదృతం చేస్తాము ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అలెం అశోక్, గోనెపల్లి ఎలుబాక సార్లమ్మ గుంపు తక్కల్ల గూడెం కాల్వపల్లి ముసలమ్మ పేట మొండ్యాలతోగు ప్రజలు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి అభివృద్ధి పనులపై జలమండలి ఎండీతో ఎమ్మెల్యే భేటీ



**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి :** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని గురువారం కలిసి పలు అభివృద్ధి అంశాలపై వినతిపత్రాలు అం దజే శారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారం, భూగర్భ డ్రైనేజీ పనులను వేగవ ంతం చేయాలని కోరారు. జలమండలిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయా లని విజ్ఞప్తి చేశారు. విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియా మకాలు కల్పించాలని కోరారు. కౌకూర్ రాజీవ్ గృహకల్పలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. మచ్చ బొల్లారం పరిధిలో ఏడు కాలనీల డ్రైనేజీ ట్రంక్ మెయిన్ నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినందుకు ఎండీకి ధన్యవాదాలు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బోర్‌వెల్‌ల మరమ్మతులు చేపట్టాలని, కొత్త తాగునీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ విస్తరణ పనులకు ఆమోదం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కాప్రాలో కాంగ్రెస్ బలోపేతానికి కమిటీల ఏర్పాటు




**ఆదాబ్ సైబరాబాద్, కాప్రా :** కాప్రా, వంపు గూడ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు డివిజన్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఎల్లారెడ్డిగూడలోని మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఈ నిర్ణయం వెల్లడించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీతారాం రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, బాధ్యతలు దక్కేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ కాప్రా డివిజన్‌లో జనరల్ బాడీతో పాటు మహిళ, యువజన, ఎస్సీ, బీసీ, మైనారిటీ సెల్ కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీహరి పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని చెప్పారు. సమావేశంలో జిల్లా, డివిజన్ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ కాంగ్రెస్‌కు డీసీసీ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ గౌడ్ నియామకం



**ఆదాబ్ సైబరాబాద్, మేడ్చెల్ :**మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్‌ను డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శ్రీకాంత్ గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులకు కాంగ్రెస్ తగిన గుర్తింపు ఇస్తోందని అన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ గౌడ్ పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సంస్థాగత బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# సీజ్ చేసిన భవనంలో మళ్లీ పనులు..! మున్సిపల్ అధికారుల తీరుపై అనుమానాలు



**ఆదాబ్ సైబరాబాద్, కాప్రా :** కాప్రా సర్కిల్ పరిధిలో గతంలో మున్సిపల్ అధికారులు సీజ్ చేసిన భవనంలో తిరిగి నిర్మాణ పనులు పూర్తి కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. సీజ్ చేసిన భవనం ప్రస్తుతం వైట్‌వాష్ దశకు చేరుకుని ప్రారంభానికి సిద్ధమవుతుండటంతో అధికారుల పర్యవేక్షణపై తీవ్ర ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సీజ్ చేసిన భవనంలో పనులు ఎవరి అనుమతితో కొనసాగాయి? అధికారులు తనిఖీలు ఎందుకు నిర్వహించలేదు? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారితో పాటు బాధ్యులైన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలో రైతు సహకార సంఘాల ఎన్నికలను రద్దు చేయాలి

- అక్రమ నియామకాలు - కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం
- పాత పద్ధతిలో ఎలక్షన్ జరపాలని డిమాండ్,
- కాంగ్రెస్ పార్టీ నాయకులకే పదవుల?
- తెలంగాణలో కాంగ్రెస్ ఇష్టరాజ్యం,
- బీజేపీ కిసాన్ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిచేలిమి కృష్ణ



**ఆధాబ్ సైబరాబాద్, కీసర :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సహకార సంఘాల ఎన్నికలను రాజ్యాంగబద్ధంగా నిర్వహించకుండా, అడ్డదారుల్లో డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్లను నియమించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్న బీజేపీ కిసాన్ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలి చేలిమి కృష్ణ. ప్రజల్లోకి వెళితే ఓడిపోతామనే భయంతో ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ తమ సొంత పార్టీ నాయకులకు అధికారాలు కట్టబెట్టడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని అన్నారు. ఎన్నికలు పెట్టి రైతులు తమ నాయకులను తామే ఎన్నుకునే అవకాశం ఇవ్వకుండా, కాంగ్రెస్ నాయకుల నుంచి నామినేషన్ ద్వారా పదవులు కట్టబెట్టడం అసలైన రైతులకు చేస్తున్న అన్యాయం. సహకార రంగాన్ని రాజకీయాలకు అడ్డాగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు సహకార సంఘాలకు వెంటనే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అన్నారు.

# యూత్ కాంగ్రెస్ నాయకుడి కుమారుడి తొలి పుట్టినరోజు వేడుకలకు హాజరైన మంత్రి సీతక్క

- చిన్నారి మోక్షిత్ సాయి రెడ్డిని ఆశీర్వదించిన మంత్రి, జంగా రాఘవ రెడ్డి



**ఆదాబ్ సైబరాబాద్, ములుగు:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం (రెడ్డిగూడెం) గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు జంగా వెంకటేష్ రెడ్డి, నవీన దంపతుల కుమారుడు మోక్షిత్ సాయి రెడ్డి తొలి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారి మోక్షిత్ సాయి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూ త్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరాల దర్యాప్తులో సాంకేతికతను సమర్థంగా వినియోగించాలి: ఎస్పీ స్నేహా మెహ్రా




**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ :** జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహా మెహ్రా, ఐపీఎస్ నేరాల దర్యాప్తులో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్ కోసం నిర్వహించిన ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు.
ఈ శిక్షణలో కాల్ డీటెయిల్ రికార్డ్స్ , ఇంటర్నెట్ ప్రోటోకాల్ డీటెయిల్ రికార్డ్స్ , టవర్ డంప్ విశ్లేషణ, సోషల్ మీడియా దర్యాప్తు వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహా మెహ్రా మాట్లాడుతూ, నేరాల స్వరూపం రోజురోజుకూ మారుతున్న నేపథ్యంలో డిజిటల్ ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, వాటిని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, నిందితులను త్వరితగతిన గుర్తించవచ్చని తెలిపారు. అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభ్యసిస్తూ దర్యాప్తు నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని ఆమె సూచించారు.


# ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా.నరేందర్‌కు ఏడాది పూర్తి

- ఎస్.పీ.ఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ ఘన సన్మానం




**అదాబ్ సైబరాబాద్, ఖమ్మం :**ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. ఎం. నరేందర్‌కు బెడ్‌సైడ్ కార్మికులు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రతి నెలా తమ వేతనాలు సకాలంలో అందుతున్నాయని పేర్కొంటూ, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ నరేందర్, ఆస్పత్రిలో ప్రతి ఉద్యోగి తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తే ప్రభుత్వ ఆస్పత్రికి మరింత మంచి పేరు వస్తుందని అన్నారు. వైద్య సేవల కోసం వచ్చే రోగులు, వారి బంధువులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బెడ్‌సైడ్ కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. వారి వేతనాల పెంపు అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, త్వరలోనే జీతాల పెంపుపై శుభవార్త వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ హామీపై బెడ్‌సైడ్ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన సేవలు అందించేందుకు మరింత అంకితభావంతో పనిచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి.ఎస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు మాతంగి అనిల్ కుమార్, ఎస్.పి.ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.హెచ్ నాగమణి, ఆర్.పద్మ, ఎస్.పి.ఎస్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు బత్తుల మమత ఎస్.పి.ఎస్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి కర్ణ జగదీష్
ఎస్.పి.ఎస్ జిల్లా కమిటీ కోశాధికారులు బాడిష హరీష్, ఏపూరి నాగమల్లిక, ఎస్.పి.ఎస్ జిల్లా కమిటీ గౌరవ సలహాదారులు పి.నాగేశ్వరరావు, ఎస్.రాధ, ఎస్.పి.ఎస్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షురాలు అలవాల అపర్ణ, గద్దల కళ్యాణి ఎస్.పి.ఎస్ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి ఎస్.కె అజారుద్దీన్ ఎస్.పి.ఎస్ జిల్లా కమిటీ ఆర్గనైజర్ సెక్రెటరీ, జి.నాగేంద్ర, ఎస్.పి.ఎస్ జిల్లా కమిటీ సభ్యులు జి.సుజాత
డి.వెంకటమ్మ, బి.అరుణమ్మ
సి.హెచ్ మహేష్ మరియు హాస్పటల్
సిబ్బంది పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్



**ఆదాబ్ సైబరాబాద్, కూకట్‌పల్లి :**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని 249వ డివిజన్ గాయత్రీనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న బీఎల్ఓల పనితీరును జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమీక్షించి, విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రశాంత్‌నగర్ డివిజన్‌లోని ఏవీబీపీ పురం కేంద్రాన్ని సందర్శించి, అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు (జీవీఆర్) పరిశీలించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు కావేటి నాగార్జున, ప్రశాంత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చందర్‌రావు, కూకట్‌పల్లి మాజీ డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, ఆర్. వాసు, ఫాల్గుణరావు, సతీష్ తదితర కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



## యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలికి శుభాకాంక్షలు తెలిపిన నాశంగారు దంపతులు



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన బోర్డు సభ్యురాలిగా నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను, నాశంగారు సుదర్శన్ యాదవ్, నాశంగారు శోభారాణి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె దేవస్థానం అభివృద్ధికి విశేష కృషి చేసి, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేలా విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. బోర్డు సభ్యురాలిగా నియామకం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్తునికి నిత్యవసర వస్తువులు పంపిణీ చేసిన కొణిజర్ల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు



**ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం/కొనిజర్ల :**ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సిద్దిక్ నగర్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సోదరుడు నంచర్ల మల్లికార్జున చారి ఇటీవల కిడ్నీ సమస్యతో బాధపడుతూ, ఉండడంతో గత నెల రోజుల క్రితం ఒక కిడ్నీ ని పూర్తిగా తీసివేయడం జరిగింది. విషయం తెలుసుకున్న కొణిజర్ల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మల్లికార్జున్ ను పరామర్శించడానికి వెళ్లి వాళ్లకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు మరియు అరకింటా బియ్యం, మల్లికార్జున కుటుంబ సభ్యులకు అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో కొణిజర్ల మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నెమలికొండ రామకృష్ణ చారి, దిగుట్ల లక్ష్మయ్య చారి, వేగ్గలం నాగ బ్రహ్మ చారి, సత్తేనపల్లి వీరచారి, సత్తేనపల్లి కృష్ణ చారి, గన్నవరపు రామచారి, సత్తేనపల్లి విష్ణు చారి, రంగు సత్యనారాయణచారి, నంచర్ల నరసింహ చారి, పంచాంక్షరీ వెంకట చారి, దిగుట్ల నాగ చారి, సత్తేనపల్లి కృష్ణమా చారి, సత్తేనపల్లి నాగేశ్వరరావు, కొత్తపల్లి కృష్ణ చారి, తూముల వైకుంఠ చారి, శ్రీ రామోజు వెంకట చారి, నంచర్ల నాగ చారి, సత్తేనపల్లి సంగయ్య చారి, బైరోజు ఉపేంద్ర చారి తదితర విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించిన కానిస్టేబుల్ ను అభినంధించిన పోలీస్ కమిషనర్



**ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం :** రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మూడు పతకాలు సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ పిల్లి రాజు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. హైదరాబాద్ లో జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్-- 2026లో పిల్లి రాజు, వుషూ -- స్వర్ణ పతకం రెజ్లింగ్ -- రజత పతకం, కెన్‌కెన్ సిలాట్ -- కాంస్య పతకాలు సాధించారు. అదేవిదంగా జూలై 12న కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజిఎఫ్)లో నిర్వహించిన, కేజిఎఫ్ అల్ట్రా గోల్డ్ రన్ 70 కె ను 9గంటల 31నిముషాలు 31సెకండ్ ల లో విజయవంతంగా పూర్తి చేశారు.

## మిగిలిపోయిన ఆహారాన్ని వేడి చేసి తింటున్నారా.. అయితే ఈ సూచనలు పాటించండి..



మిగిలిపోయిన ఆహారాన్ని మళ్లీ వేడి చేసి తినడం చాలా మందికి రోజువారీ అలవాటు. ఇలా చేయడం వల్ల సమయం ఆదా కావడంతోపాటు ఆహార వృథా కూడా తగ్గుతుంది. అయితే వండిన ఆహారాన్ని మళ్లీ వేడి చేసే విధానం కూడా వంట చేసినంతే ముఖ్యమని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ సూచిస్తోంది. సరైన పద్ధతిలో వేడి చేయకపోతే ఆహారంలో బ్యాక్టీరియా పెరిగి ఫుడ్ పాయిజనింగ్ వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. చాలామంది క్రితం రోజు కూర లేదా పప్పును వేడి చేస్తూ దానిలో తాజాగా వండిన కూర లేదా పప్పును కలిపేస్తుంటారు. అయితే ఇలా చేయకూడదని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచిస్తోంది. తాజాగా వండిన ఆహారం, మిగిలిన ఆహారం ఉష్ణోగ్రతలు, తాజాదనం వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి రెండింటినీ విడివిడిగా బాగా వేడి చేసి, అవసరమైతే తర్వాత మాత్రమే కలపడం మంచిది.పదే పదే వేడి చేసి ఫ్రిజ్‌లో పెట్టవద్దు..ఒకే ఆహారాన్ని పదే పదే వేడి చేసి మళ్లీ ఫ్రిజ్‌లో పెట్టడం కూడా మంచిది కాదు. ప్రతిసారి ఫ్రిజ్ నుంచి బయటకు తీసి వేడి చేసి, మళ్లీ చల్లబరిచి నిల్వ చేయడం వల్ల బ్యాక్టీరియా పెరిగే అవకాశాలు ఎక్కువవుతాయి. అందుకే ఒకసారి మాత్రమే వేడి చేసి తినేలా ముందుగానే అవసరమైన పరిమాణాన్ని తీసుకోవడం ఉత్తమం. మిగిలిన ఆహారాన్ని మొత్తం వేడి చేయకుండా, తినాల్సినంత మాత్రమే తీసుకుని వేడి చేయాలి. మిగతా ఆహారాన్ని ఫ్రిజ్‌లో అలాగే ఉంచడం వల్ల దాని నాణ్యత సురక్షితంగా ఉంటుంది. ఉదాహరణకు నలుగురికి సరిపడే పులావ్ మిగిలి ఉండి ఒక్కరే తినాల్సి వస్తే, మొత్తం కాకుండా ఒక్క సర్వింగ్ మాత్రమే వేడి చేసుకోవాలి. మైక్రోవేవ్‌లో ఆహారం వేడి చేసేటప్పుడు మధ్య మధ్యలో బాగా కలపాలి. చాలాసార్లు పైభాగం మాత్రమే వేడిగా ఉండి, లోపల మాత్రం చల్లగానే ఉంటుంది. ఇలా సమానంగా వేడి కాకపోతే కొన్ని ప్రాంతాల్లో బ్యాక్టీరియా జీవించే అవకాశం ఉంటుంది. అందుకే ఆహారం మొత్తం సమానంగా వేడెక్కేలా కలుపుతూ వేడి చేయడం అవసరం.ఫ్రీజర్‌లో ఉన్న ఫుడ్ అయితే..ఫ్రీజర్‌లో నిల్వ చేసిన ఆహారాన్ని నేరుగా స్టవ్‌పై లేదా మైక్రోవేవ్‌లో వేడి చేయకూడదు. ముందుగా పూర్తిగా కరిగిన తర్వాత మాత్రమే వేడి చేయాలి. లేదంటే బయట భాగం ఎక్కువగా వేడెక్కి, లోపల చల్లగా ఉండే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఆహారం సురక్షితంగా మారదు. సరిగా వేడి చేయని ఆహారం చూసేందుకు లేదా వాసనకు బాగానే అనిపించినా, అందులో బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంటుంది. అలాంటి ఆహారం తీసుకుంటే కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి ఫుడ్ పాయిజనింగ్ లక్షణాలు కనిపిస్తాయి. మిగిలిన ఆహారాన్ని సరైన పద్ధతిలో నిల్వ చేసి, అవసరమైనంత మాత్రమే ఒక్కసారి వేడి చేసి తీసుకోవడం ద్వారా ఆహార వృథాను తగ్గించడంతోపాటు కుటుంబ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.

# రైతు సహకార సంఘాల ఎన్నికల నుంచి పారిపోతున్న కాంగ్రెస్

- అడ్డదారుల్లో పదవుల పంపకం ప్రజాస్వామ్య హత్యే!
- ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేకే రైతుల ఓటు చోరీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నామినేషన్ల నాటకం
- బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపేట్ గౌరారం జగన్ గౌడ్



**ఆదాబ్ సైబరాబాద్, మేడ్చల్:** తెలంగాణ రాష్ట్రంలో రైతు సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికలను పక్కనపెట్టి అడ్డదారుల్లో డైరెక్టర్లు, చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లను నియమించడం అత్యంత దుర్మార్గమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని బీజేపీ జిల్లా పార్టీ తీవ్రంగా ఖండించారు.రైతుల ఓటుతో నాయకులను ఎన్నుకునే అవకాశాన్ని హరించి, అధికారాన్ని అడ్డంపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పదవులు కట్టబెట్టడం సిగ్గుచేటని అన్నారు. ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేక, ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నామినేషన్ల పేరుతో పదవుల పంపకానికి తెరలేపిందని విమర్శించారు.రైతు సహకార సంఘాలు కాంగ్రెస్ పార్టీ రాజకీయ పునరావాస కేంద్రాలు కావని, అవి రైతుల సంస్థలని గుర్తుంచుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్న ఈ ప్రభుత్వానికి రైతాంగం తగిన గుణపాఠం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు.వెంటనే ఈ అక్రమ నియామకాలను రద్దు చేసి, రాష్ట్రంలోని అన్ని రైతు సహకార సంఘాలకు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.రైతులు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలు, తెలంగాణ సబ్బండ వర్గాల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం రోజురోజుకూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో తన పతనాన్ని తానే వేగవంతం చేసుకుంటోందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలే గట్టి తీర్పు ఇవ్వడం ఖాయమన్నారు.

# ఎటువంటి బేషజాలు లేకుండా సీతారామ పనులు పూర్తి చేస్తాం మంత్రి పొంగులేటి



**ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం/ సత్తుపల్లి:**సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, తమ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ పనులను వేగవంతం చేస్తోందని తెలిపారు. డిజైన్ల మార్పుల పేరుతో కాలయాపన చేసే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. ఈ కరువు కాలంలో కూడా ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేసి రైతులకు అండగా నిలిచామని ఆయన వివరించారు. అనంతరం ఈ సమీక్షలో సీతారామ భూసేకరణ పనుల కోసం వెంటనే 135 కోట్ల రూపాయలను విడుదల చేయాలని, నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేసి వెంటనే టోకెన్లు పంపాలని, కలెక్టర్లను ఆదేశించారు. పనుల వేగాన్ని బట్టి ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు దివాకర టి.ఎస్, అంకిత్, ఎం.పీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అక్రమంగా పట్టా చేయించుకొన్న భూమిని రద్దు చేయాలి

- కొడుకు, మనవడి నుండి ప్రాణ హాని ఉంది
- రక్షణ కల్పించి న్యాయం చేయండి
- విలేఖరుల సమావేశంలో బాధితులు శివలా, తులసి బాయ్





**ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం :**అక్రమంగా తన పొలం పట్టా చేయించుకున్నారని, దాన్ని రద్దు చేయాలని, కొడుకు, మనవడి నుండి ప్రాణ హానీ ఉందని, రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితులు శివ లా వేడుకున్నాడు. కూసుమంచి మండలం రావి చెట్టు తండా కు చెందిన శివలా తన కోడలు తేజావత్ తులసి బాయి తో కలిసి ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూసుమంచి రెవెన్యూ పరిధిలోని తమ వ్యవసాయ పొలంలో సాగు చేస్తుండగా, తన కుమారులు కోడళ్ళు కలిసి నాపై దాడి చేసి, విచక్షణా రహితంగా కొట్టి చంపుతామని బెదిరిస్తున్నారని శివలా ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రాణ హానీ ఉందని రక్షణ కల్పించాలని వేడుకున్నాడు. తులసి బాయి మాట్లాడుతూ, గత నెల జూన్ 5న ఆదివారం సాయంత్రం 4:15 నిముషాలకు నా పొలంలో వరి నారుకు నీళ్లు పెట్టేందుకు వెళ్ళానని, అదే సమయంలో మా మామ చేనును ట్రాక్టర్ తో దున్నేందుకు మా బావ, ఆయన కుమారుడు వచ్చారని తెలిపారు. ఆ పొలాన్ని మా మామను భయపెట్టి బలవంతంగా లాక్కున్నారని తెలిపారు. ఇది గ్రహించిన మా మామ ఆ పొలాన్ని నాకు కౌలుకు ఇచ్చారని, అతని బాగోగులు కూడా నేను ,నా కుమార్తెలు చూసుకుంటున్నామని తెలిపారు. రెండేళ్ల క్రితం నా భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయారని, నాకు అండదండలు ఎవరూ లేరని గ్రహించి, నాపై , ఆడపిల్లలపై దాడికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అసభ్యకరమైన పదజాలంతో బూతులు తిడుతూ రాళ్లతో కట్టెలతో గాయపరుస్తున్నారన్నారని, మీ అంతు చూస్తాం. నిన్ను చంపి అయినా సరే ఈ పొలాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

# 102 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్

- చెక్కులు పంపిణీ చేసిన నకిరేకల్
- ఎమ్మెల్యే వేముల వీరేశం





**ఆదాబ్ సైబరాబాద్, నకిరేకల్ :** నియోజకవర్గంలోని నార్కెట్‌పల్లి మండలానికి చెందిన 102 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ నకిరేకల్ నియోజకవర్గంలో రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని చెప్పారు.
చెక్కులు అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లల మెదడు అభివృద్ధికి దోహదపడే బ్లూబెర్రీలు.. రోజూ ఇస్తే ఎన్నో ఉపయోగాలు..



బ్లూబెర్రీలు ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందాయి. తాజాగా వెలువడిన ఒక అధ్యయనం ప్రకారం, ఈ పండ్లలో ఉండే సహజ సమ్మేళనాలు పిల్లల్లో మెదడు అభివృద్ధి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, భావోద్వేగ నియంత్రణకు తోడ్పడే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ ప్రయోజనాలను పూర్తిగా నిర్ధారించేందుకు మరిన్ని దీర్ఘకాలిక అధ్యయనాలు అవసరమని వారు స్పష్టం చేస్తున్నారు. బాల్యం అంటే మెదడు వేగంగా అభివృద్ధి చెందే కీలక దశ. ఈ సమయంలో నేర్చుకునే సామర్థ్యం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, భావోద్వేగాలు, సామాజిక ప్రవర్తన వంటి అంశాలు రూపుదిద్దుకుంటాయి. ప్రస్తుతం పిల్లల్లో ఆందోళన, నిరాశ, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఆహారం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచే మార్గాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారిస్తున్నారు.
మెదడు కణాలకు రక్షణ..బ్లూబెర్రీల్లో ఆంథోసయనిన్స్, ఫ్లావోనాల్స్, ఫీనాలిక్ యాసిడ్స్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కలిగి ఉండటంతో మెదడు కణాలను దెబ్బతినకుండా కాపాడడంలో సహాయపడతాయి. ముఖ్యంగా ఆంథోసయనిన్స్ రక్త-మెదడు అవరోధాన్ని దాటి నేరుగా మెదడుపై ప్రభావం చూపగలవని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి మెదడు కణాల మధ్య సమాచార మార్పిడిని మెరుగుపరచి జ్ఞాపకశక్తి, అభ్యాస సామర్థ్యానికి మద్దతు ఇస్తాయి. అధ్యయనంలో పాల్గొన్న కొన్ని పరిశోధనల్లో బ్లూబెర్రీలు తీసుకున్న పిల్లలు జ్ఞాపకశక్తి పరీక్షల్లో, ముఖ్యంగా పదాలను గుర్తుంచుకోవడం, కొంత సమయం తర్వాత గుర్తు చేసుకోవడం వంటి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించినట్లు గుర్తించారు. అలాగే ఏకాగ్రత, ప్రతిస్పందన వేగంలో కూడా కొంత మెరుగుదల కనిపించినట్లు నివేదించారు.మెరుగయ్యే మానసిక స్థితి..బ్లూబెర్రీలు పిల్లల మానసిక స్థితిపైనా సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఒక్కసారి బ్లూబెర్రీలు తీసుకున్న తర్వాత కూడా కొందరు పిల్లలు, యుక్తవయస్కుల్లో సానుకూల భావోద్వేగాలు పెరిగినట్లు గుర్తించారు. మెదడులో భావోద్వేగాలను నియంత్రించే ఉంటుందని భావిస్తున్నారు.

# హైదరాబాద్ మెట్రో రెండో దశ - కాగితాల్లో తప్ప క్షేత్రస్థాయిలో పడని ముందడుగు

**హైదరాబాద్:** నగర ప్రజల జీవనాడి మెట్రో మొదటిదశ పూర్తయిన 2020 ఫిబ్రవరి తర్వాత రెండోదశకు సంబంధించి వ్యవహారం నత్తనడక తీరును తలపిస్తోంది. వ్యవహారమంతా కాగితాల్లో తప్ప క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ వ్యవహారం ఒక బంతి ఆటలా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండోదశ డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక)లను దిల్లీకి పంపగా కొర్రీలు వేస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా సాగదీస్తోంది. ఒకసారి మెట్రోలైట్(ఈ-బీఆర్టీఎస్), మరోసారి ర్యాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్టీఎస్) అంటూ సమయం వృథా చేస్తోందనే విమర్శలు వినపడుతున్నాయి.నాడు జాప్యం : మొదటిదశ మెట్రో పూర్తి కావొస్తుండంతో రెండోదశ ప్రతిపాదనలను కేంద్రానికి పంపేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తాత్సారం చేసింది. రెండోదశలో నాగోల్ నుంచి ఎల్బీనగర్ 5 కిలో మీటర్లు, లక్డీకాపూల్ నుంచి గచ్చిబౌలి-కొండాపూర్-మియాపూర్ చౌరస్తా(పాత మెట్రోని కలుపుతూ), బీహెచ్ఈఎల్ వరకు 26 కిలో మీటర్లను ప్రతిపాదించారు. డీపీఆర్లు సిద్ధమైనా నాడు కేబినెట్ ఆమోదానికే బీఆర్ఎస్ ప్రభుత్వం నెలల తరబడి సమయాన్ని తీసుకుంది. ఎన్నికలు సమీపించడంతో హుటాహుటిన 2022 చివరలో కేంద్రానికి డీపీఆర్లను పంపారు. 2023లో సవరించిన డీపీఆర్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం పంపింది. రెండు మార్గాలు కలిపి నాటి అంచనా వ్యయం రూ.8,453 కోట్లుగా చూపారు. అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని పలుమార్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మార్గంలో ప్రయాణికులు లేరని కేంద్రం అనుమతి పెండింగ్లో పెట్టిందని అధికారులు



చెబుతున్నారు. తెరమీ దకు కొత్తగా మెట్రోలైట్ : రూ. 6,250 కోట్ల అంచనా వ్యయంతో రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి 31 కిలోమీటర్ల మార్గానికి మాజీ సీఎం కేసీఆర్ 2022 డిసెంబరు 9న శంకుస్థాపన చేశారు. దీనికి కేంద్రం నుంచి అనుమతి లభించలేదు. ప్రత్యామ్నాయంగా మెట్రోలైట్ను కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో కేపీ హెచ్బీ నుంచి కోకాపేట వరకు మెట్రో లైట్(ఎలివెట్-బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్)ను కొత్తగా తెరమీదకు తీసుకొచ్చారు. ఈ ప్రతిపాదనలను కేంద్రం పక్కన పెట్టేయడం గమనార్హం.నేడు వెంటపడుతున్నా : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పగ్గాలు చేపట్టి రెండోదశ మెట్రో విస్తరణలో పలు మార్పులు, చేర్పులను చేసింది. తొలుత ఐదు కారిడార్ల డీపీఆర్లను కేంద్రానికి 2024లో సమర్పించారు. బడ్జెట్ పెట్టి నిధులు కేటాయించాలని కోరారు. ఇందులో పాతబస్తీ మెట్రో కూడా కలిసే ఉంది. అనుమతి రాకముందే ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి 2024 మార్చి 8న శంకుస్థాపన కూడా చేశారు. ఫోర్త్సిటీ(భారత్ ఫ్యూచర్ సిటీ)తో ప్రజల డిమాండ్ల మేరకు శామీర్పేట, మేడ్చల్ కారిడార్లను కలిపి మరో మూడు కారిడార్లను జోడించారు.ఫోర్త్సిటీకి మెట్రో రెండోదశ నుంచి మినహాయించాలని కేంద్రం సూచించడంతో దానిని మూడోదశకు చేర్చారు. ఒకే యాజమాన్యం కిందనే మెట్రోరైలు ఉండాలని సూచించడంతో మెట్రోరైలు మొదటిదశకు సంబంధించి ప్రైవేట్ సంస్థ ఎల్అండ్టీ నుంచి పూర్తి వాటాను కొనుగోలుకు తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రత్యామ్నాయాలు తెర పైకి : మెట్రో ప్రత్యామ్నాయంగా ర్యాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్(ఆర్ఆర్టీఎస్) పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం కోరింది. దీని వల్ల భారీగా ఖర్చు తగ్గుతుందని సూచించింది. కిలోమీటర్కు ఒక స్టేషన్ ఉండే సిటీలో ర్యాపిడ్ రైల్ ఎలా సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. మెట్రో రెండోదశ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ జాయింట ప్రాజెక్ట్గా ఉంటే వేర్వేరు యాజమాన్యాలు అవుతాయి. సమస్య తలెత్తకుండా రెండోదశను సైతం రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులతో చేపడుతుందని దానికైనా అనుమతి ఇవ్వాలని కోరుతోంది.

# సైబర్ బాధితులకు డబ్బు రీఫండ్ మరింత సులభతరం

**హైదరాబాద్** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బు పోగొట్టుకున్న బాధితులకు ఉపశమనం కలిగించేలా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ తరహా సైబర్ మోసాలకు గురైన బాధితులు వారి సొమ్మును తిరిగి పొందేందుకు ఏర్పాటు చేసిన నేషనల్ సైబర్క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పీ)ను మరింత సులభతరం చేసినట్లు వివరించింది. ఇకపై సైబర్ నేరాలకు గురైన బాధితులు వారి అభ్యర్థనలను మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)లోనే నమోదు చేసుకో వాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సంచాలకులు శిఖా గోయల్ వెల్లడించారు. దీని ద్వారా బాధితులకు వేగంగా రీఫండ్ చేయొచ్చని తెలిపారు. బాధితులకు వెంటనే చెల్లించేలా : ప్రస్తుతం చాలా మంది సైబర్ బాధితులు సకాలంలో ఎన్సీఆర్పీలో ఫిర్యాదు చేస్తున్నారు. దీని ద్వారా ఆ కాజేసిన సొమ్ము నేరగాళ్ల ఖాతాలో జమ కాకుండా ఇన్వెస్టిగేటివ్ అధికారులు దాదాపుగా అడ్డుకోగలుగుతున్నా రు. అయితే, గతంలో ఇలా జప్తు చేసిన డబ్బును తిరిగి బాధితులకు చెల్లించే ప్రక్రియ న్యాయస్థానం ద్వారా జరిగేది.



దీనికి చాలా సమయం పట్టేది. ఇందుకు పరిష్కారంగా ఎన్సీఆర్పీని తీసుకొచ్చారు. ఇప్పుడు ఈ పోర్టల్ను మరింత సులభతరం చేసేలా మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులోనే పొందుపరచాలి : సైబర్ బాధితులు పోర్టల్లో ఫిర్యాదు చేసిన తర్వాత చేయాల్సిన ప్రక్రియ గురించి శిఖా గోయల్ వివరించారు. బాధితుల సొమ్ము నేరగాళ్ల ఖాతాల్లోకి చేరేకుండా, ఆ లావాదేవీని నిలిపివేసిన (ఫ్రీజ్) సందర్భంలో ఎంఆర్ఎంలో మాత్రమే వారి వివరాలు పొందుపరచాలని ఆమె సూచించారు. దీనిపై మరిన్ని సందేహాలు నివృత్తి చేసుకోవానుకుంటే పరిధి పోలీస్? స్టేషన్?నుగానీ లేదా కేసు దర్యాప్తు అధికారినిగానీ సంప్రదించాలన్నారు.?

# గ్యాంగ్ రేప్ కేసులో జగిత్యాల కోర్టు సంచలన తీర్పు

**జగిత్యాల:** సభ్యసమాజం తలదించుకునేలా మైనర్ బాలికపై జరిగిన సామూహిక లైంగిక దాడి కేసులో జగిత్యాల జిల్లా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ సెషన్స్ కోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ అమానవీయ ఘటనకు పాల్పడిన ఐదుగురు కామాంధులను దోషులుగా నిర్ధారిస్తూ.. వారికి జీవితఖైదు శిక్ష వేసింది. అలాగే ఒక్కొక్కరికీ రూ.20 వేల జరిమానాను కూడా వేసింది. అంతేకాకుండా బాధిత బాలికకు రూ.12 లక్షల నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.పోలీసు రికార్డులు, కోర్టు వివరాల ప్రకారం.. మెట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 అక్టోబర్ నెలలో ఒక బాలికపై ఐదుగురు వ్యక్తులు అత్యంత దారుణంగా సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన అప్పట్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు



అప్పటి మెట్పల్లి సబ్ ఇన్స్పెక్టర్ సదాకర్ రంగంలోకి దిగి నిందితులైన 22 ఏళ్ల లోకిని రాజేశ్, 21 ఏళ్ల దారంగుల సాయికుమార్, 19 ఏళ్ల మొగిలిపాక అనిల్, 19 ఏళ్ల కుంచెపు శివ, 22 ఏళ్ల కుంచెపు వెంకటేశ్లపై పోక్సో చట్టంతో పాటు పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితులందరినీ అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.

# సర్ ప్రక్రియలో వేధిస్తున్న మారు పేరు ముప్పు

**హైదరాబాద్:** ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న సర్ ప్రక్రియ పలువురు ఓటర్లకు తలనొప్పి తెచ్చిపెడుతోంది. ప్రధానంగా సింగరేణిలో దశాబ్దాల కింద మారు పేరుతో ఉద్యోగంలో చేరి, ప్రస్తుతం జీవించి ఉన్న వారిలో చాలా మంది ఓటు హక్కు కోల్పో యే ప్రమాదం నెలకొంది. ఇలా పేరు మార్చు కొని కొలువు చేసి, పదవీ విరమణ పొంది తమ స్వగ్రామాల్లో ఉంటూ సొంత పేరుతో చెలామణి అవుతున్న వారితో పాటు వారి కుటుంబ సభ్యుల ఓటు హక్కు గల్లంతయ్యే ప్రమాదం ఏర్పడింది. సుమారు పాతిక వేల మంది వరకు : 1970 నుంచి 1990 మధ్య కాలంలో టెక్నాలజీ అంతలా అభివృద్ధి చెందలేదు. ఈ సమయంలో సింగరేణిలో జనరల్ మేనేజర్ (జీఎం) స్థాయిలోనే ఉద్యోగాలు కల్పించే వెసలుబాటు ఉండేది. దీంతో అక్కడ చాలా మంది ఇతరుల పేర్ల మీద కొలువుల్లో చేరారు. సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య 2001 నాటికి లక్ష మందికిపైనే. ప్రస్తుతం ఇది 40 వేలకు తగ్గిపోయింది. పదవీ విరమణ పొందిన వారిలో ప్రస్తుతం 10 వేల




మంది జీవించి ఉండగా, వారి కుటుంబ సభ్యులతో కలిపి 25 వేలకు చేరుతోంది.పేర్లు ఎందుకు మార్చుకున్నారంటే : అప్పట్లో బొగ్గు టబ్బుల చక్రాలు, ఇసుక బస్తాలు ఎత్తడం, పరగు పందెం వంటి పద్ధతుల ద్వారా వేల సంఖ్యలో సింగరేణి కొలువుల్లో చేరారు. ఆ కాలంలో గని ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. దీంతో చాలా మంది పని చేసేందుకు మొగ్గు చూపేవారు కాదు. అయితే, ఎంప్లాయ్?మెంట్ కార్డు ఉన్నవారికి డబ్బు చెల్లించి ఇతరులు దాన్ని వినియోగించుకున్నారు. ఈ క్రమంలో ఆ కార్డులోని పేరు మీదనే చాలా మంది గనిలో ఉద్యోగాల్లోకెక్కారు. దీనికి తోడు అప్పుడు జీఎంల స్థాయిలో ఉద్యోగ నియామకం ఉండటం వల్ల డబ్బులు తీసుకొని వారికి తెలిసిన వారిని, బంధువులను నియమించారు. ఈ విధంగా కార్డులోని మారు పేర్లతో చేరినవారు ఉద్యోగంలో కొనసాగినంత వరకూ అదే పేరుతోనే పని చేశారు.2002 నాటి ఓటరు జాబితా కోసం : సాధారణంగా కోల్?బెల్ట్?లో ఒక చోటు నుంచి మరో ప్రాంతానికి బదిలీలు జరుగుతుంటాయి. ఇలా చాలా మంది అధికారులు, శ్రామికులు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ట్రాన్స్?ఫర్? అయ్యారు. ఇప్పుడు వారు 2002 నాటి ఓటరు జాబితా ఎక్కడ దొరుకుతుందో తెలియక ఎంతో అవస్థ పడుతున్నారు. చదువుకున్నవారితో పాటు విద్యావంతులైన పిల్లల సహాయం ద్వారా పలువురు 2002 నాటి జాబితాను ఆన్?లైన్?లో పొందగలిగారు. అయినా చాలా మందికి సర్ సమాచారం అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరునామా మారిన వారి వివరాలు బీఎల్?ఓలకు తెలియక ఆచూకీ కోసం వారు ఇబ్బంది పడుతున్నారు.'అసలు పేరు రాసే అవకాశం లేదు' : కరోనా సమయంలో రమణయ్య (పేరు మార్చాం) అనే ఓ విశ్రాంత ఉద్యోగి చనిపోయారు. ఈయన గతంలో మారు పేరుతో గనిలో ఉద్యోగం చేశారు. ఈయనకు ముగ్గురు కుమారుల్లో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ఒకరికి కొలువు ఇప్పించారు. తండ్రి మారు పేరుతో ఉన్న ఇంటిపేరుతోనే కుమారుడు కూడా తన పేరును కొనసాగించి ఉద్యోగంలో చేరాడు. తమ తండ్రి అసలు పేరుతో చెలామణి అవుతున్న మిగితా ఇద్దరు కుమారులకు ఇప్పుడు సమస్యగా ఎదురైంది. 2002 తమ తండ్రి పేరు ప్రకారం ఇప్పుడు సర్ జాబితాలో నింపడానికి పోయిందని వారిద్దరు వాపోతున్నారు.

# బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారు


హైదరాబాద్, జులై 16 (: భాగ్యనగరంలోని పాతబస్తీ సైదాబాద్లో ఉన్న సక్సెస్ స్కూల్లో రెండోతరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థికి హోమ్వర్క్లో కల్మా, సూరహ్ ఫాతిహా చదివి రావాలని స్కూల్ డైరీలో రాశారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. కొంతమంది బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యం తీరుపై ధ్వజమెత్తారు.సెక్యూలర్ సంఘాలు ఎందుకు నోరు మెదపట్లేదు.. (గురువారం) హైదరాబాద్ వేదికగా మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. కల్మా సూరహ్ ఫతే చదవాలని హుకుం జారీ చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. సోకాల్డ్ సెక్యూలర్ సంఘాలు ఎందుకు ఈ విషయంపై నోరు మెదపడం లేదు? అని ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ముక్తకంఠంతో ఈ విషయాన్ని ఖండించాలని అన్నారు. సైదాబాద్



సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తే... తెలంగాణ అంతటా ఇదే సంస్కృతి విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకోవాల్సిందే.. ఆటోడ్రైవర్ భరత్ను వేధించిన పోలీసులు, మజ్లిస్ నాయకులపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందేనని బండి సంజయ్ డిమాండ్ చేశారు. భరత్ రాసిన దాంట్లో తప్పేముంది? అని ప్రశ్నించారు. హిందువుల గురించి ఉర్దూలో ఆటోల్లో, గోడలపై రాసుకున్న వారిపై ఎందుకు కేసులు పెట్టడం లేదు? అని నిలదీశారు. వాళ్లకో న్యాయం?, భరత్కు ఇంకో న్యాయమా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామని స్పష్టం చేశారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

# పోలీసుల నిర్లక్ష్యం.. విద్యార్థినులను వేధిస్తున్న టీచర్పై

**హైదరాబాద్:** కాంగ్రెస్ సర్కార్ పాలనలో అమ్మాయిలకు రక్షణ లేకుండా పోతుంది. ఆకతాయిలు మైనర్ బాలికలపై వేధింపులకు పాల్పడుతూ పోలీసుల భయం లేకుండా యధేచ్ఛగా తప్పించుకు తిరుగుతున్నారు. మరోవైపు పోలీసులు కూడా ఫిర్యాదులు నమోదైనా నిందితులపై నిఘా పెట్టడంలో, వారిపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు.ఇటీవలే షాబాద్ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపి న విషయం తెలిసిందే. పోక్సో నిందితుడు రాజ్కుమార్కు అరెస్ట్ చేయకుండా వదిలేసి షాబాద్ హత్యల ఘటనకు కారణమైన పోలీస ు ల నిర్లక్ష్యంపై పెద్ద ఎత్తు విమర్శలు వచ్చాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో పోలీసుల నిర్లక్ష్యంతో పోక్సో కేసు నిందితుడు బాధిత బాలికను ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనలు మరువక ముందే తాజాగా హైదరాబాద్ --



తిలక్నగర్లోని శ్రీ విద్యా పాఠశాలలో మాథ్స్ టీచర్ రవితేజ విద్యార్థినులను అసభ్యంగా వేధిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది.ఈ విషయమై విద్యార్థినుల తల్లిదండ్రులు టీచర్పై ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదైనా ఇప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ ఘటనపై పోలీసులను అడిగితే మాకు వేరే పనులు ఉండవా..

# నొప్పులు వచ్చినా వైద్యులు రాకపోవడంతో.. నిల్చున్న చోటే ప్రసవించిన గర్భిణీ.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని పాలకులు చెప్తున్న మాటలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా నీరుగారుతున్నాయో చెప్పడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఈ ఘటనే నిదర్శనం. ఇక్కడి మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వైద్యుల బాధ్యతారాహిత్యం పరాకాష్టకు చేరింది. కాన్పు కోసం వచ్చిన ఒక గర్భిణిని చేర్చుకుని తక్షణ చికిత్స అందించడంలో అక్కడి డ్యూటీ డాక్టర్లు, నర్సులు ఘోరంగా విఫలం అయ్యారు. ఆమె పురిటి నొప్పులతో తీవ్రంగా బాధ పడుతున్నా పట్టించుకోలేదు. దీంతో నిల్చున్న చోటే సదరు గర్భిణీ ప్రసవించింది. పుడుతు ఒడగానే బిడ్డ కింద పడిపోవడంతో.. తీవ్ర గాయాలపాలైంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తీవ్రమైన ప్రసవ నొప్పులతో బాధ పడుతున్న గర్భిణిని డెలివరీ నిమిత్తం మాతా శిశు సంరక్షణ కేంద్రానికి



తీసుకొచ్చారు. ఆమె నొప్పులతో విలవిల్లాడుతున్నా. అత్యవసరంగా లేబర్ వార్డుకు తరలించాల్సిన వైద్యులు ఆ గర్భిణిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. సమయం గడుస్తున్న కొద్దీ నొప్పులు మరింత తీవ్రం కావడంతో.. ఆసుపత్రి ప్రాంగణంలోనే నిలబడి ఉన్న సదరు మహిళ అలా నిలబడే పండంటి బిడ్డకు జన్మను ఇచ్చింది. ఈ ప్రక్రియలో నవజాత శిశువు నిలబడి ఉన్న ఎత్తు నుంచి నేరుగా గట్టి నేలపై పడిపోయింది. దీనితో పసికందు తలకు, శరీరానికి తీవ్రమైన గాయాలు అయ్యాయి.

# వివాహేతర బంధంలో కొత్తరకం ట్విస్ట్ - వేరొక మహిళతో స్నేహం చేస్తోందని ప్రియురాలి హత్య

**హుజురాబాద్:** భర్త మరణంతో ఒంటరైన మహిళ ఓ మనిషిని నమ్మింది. అతనే సర్వస్వమనుకుని సహజీవనం చేస్తోంది. ఇద్దరూ కలిసి అయినవారికి దూరం గా వేరొక ఊరిలో కాపురం పెట్టారు. అక్కడ ఆమెకు వేరొక మహిళతో పరిచయం ఏర్పడి ంది. పరిచయం కాస్త స్నేహంగా మారి తన కష్టసుఖాలు పంచుకునేంతా బలపడింది. అదే ఆ మహిళపాలిట శాపంగా మారింది. చివరకు స్నేహితురాలి ఇంట్లోని బావిలో శవంగా తేలింది. అసలేం జరిగిందంటే : హుజూరాబాద్ ఏసీపీ మాధవి కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్లోని ఓ ఇంట్లోని బావిలో ఈ నెల 11న ఓ మృతదేహం బయటపడింది. మామిండ్లవాడకు చెందిన ముత్తోజు భాగ్య అనే మహిళ తన ఇంటి ఆవరణలోని బావిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. వారు వచ్చి బావిలోంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలు స్థానికంగా




నివాసముండే చింత సునీతగా గుర్తించారు. మృతురాలి మెడకు చీరతో ఉరివేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ముఖం, పెదాలపై గాయాలున్నట్లు పోలీసులు గుర్తించారు.వేరొక మహిళతో స్నేహం చేస్తోందని : పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన 35 ఏళ్ల చింత సునీత, కుమార్ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు సంతానమున్నారు. ఐదేళ్ల కిందట కుమార్ మృతిచెందాడు. అప్పటి నుంచి సునీత మోతె కిరణ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఇద్దరూ కలిసి హుజూరాబాద్లోని మామిండ్లవా డలో నివాసముంటున్నారు. సునీతకు తన ఇంటి పక్కనే ఉండే భాగ్య అనే మహిళతో పరిచయమై మంచి స్నేహితులుగా మారారు. తన కష్టసుఖాలన్నీ సునీత భాగ్యతో చెప్పుకునేది. భాగ్య, సునీతల మధ్య బలపడిన స్నేహం కిరణ్కు ఏమాత్రం నచ్చలేదు. తనతో మాట్లాడొద్దంటూ పలుమార్లు సునీతను హెచ్చరించాడు. ప్రియురాలిని హతమార్చి, బావిలో పడేసి : కొన్నాళ్లకు కిరణ్, సునీతల మధ్య సఖ్యత లోపించింది. దీంతో వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కిరణ్ను కాదని సునీత భాగ్య ఇంట్లో తలదాచుకునేది. ఇది కిరణ్కు మరింత కోపం తెప్పించింది. ఈ నెల 10న కిరణ్, సునీత ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. భాగ్యతో స్నేహం చేయడం మానుకోవాలంటూ మరోసారి గొడవపడిన కిరణ్ సునీతను తీవ్రంగా కొట్టి గొంతునులిమి చంపాడు. కేసును భాగ్యపై నెట్టేందుకు ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని భాగ్య ఇంటి ఆవరణలోని బావిలో పడేశాడు."భాగ్య ఇంటికి వెళ్లొద్దని ప్రియుడు వారించినా సునీత వెళ్లడంతో పాటు, ఆమె కుమారుడికి రూ.10 వేల నగదును కూడా అప్పు ఇచ్చింది. ఆ విషయంలో ఇంట్లో గొడవలు జరిగాయి. సునీత ఎదురుతిరుగుతుంటే, తన మాట వినడం లేదనే ఉద్దేశంతో ఆమెను చంపాలని పథకం రచించాడు. ఈనెల 10 తేదీన వారిద్దరూ ఆల్కహాల్ తీసుకున్నారు. భోజనం తర్వాత ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. సునీత నిద్రిస్తున్న క్రమంలో ఆమె గొంతుకు ఉరిపెట్టి చంపేశారు. అనంతరం ప్రియురాలి మృతదేహాన్ని భాగ్య ఇంట్లోని బావిలో పడేశాడు"

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com